క్లుప్తంగా

నేడు అవగాహన సమావేశం

మిడ్జిల్: జాతీయ నులి పురుగుల దినోత్సవం ను పురస్కరించుకొని మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మధ్యాహ్నం 2 గంటలకు అవగాహన సమావేశం ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు వైద్యాధికారి శివకాంత్ వివరాలను తెలియజేశారు. సమావేశానికి మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల నుంచి ఒకరు, అలాగే పంచాయతీ కార్యదర్శులు తప్పకుండా హాజరుకావాలని సూచించారు.

20న పశువుల సంతవేలం

దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రంలో పశువుల సంత వేలం ఈ నెల 20న ఉదయం 10.30 గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరుగుతుందని ఈవో సీత్యానాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేలంలో పాల్గొనేవారు రూ. 3 లక్షలు డీడీ తీసి 19న సాయంత్రం 5 గంటలలోపు పంచాయతీలో ఇచ్చి పేరు నమోదు చేసుకోవాలని కోరారు. అలాగే తైబజార్‌కు రూ. 1.50 లక్షలు, గొర్రెలు మేకల సంతకు రూ. 2 లక్షల ప్రకారం డీడీలు తీసి ఇవ్వాలని కోరారు. సకాలంలో డీడీలు ఇచ్చిన వారే వేలంలో పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు. వేలం పొందిన కాంట్రాక్టర్‌లకు 20.06. 2024 నుంచి 31.03. 2025 వరకు రుసుము వసూలు చేసుకోనే అధికారం ఉంటుందని తెలిపారు.

మార్కెట్‌లో నేడు లావాదేవీలు..

దేవరకద్ర: నియోజకవర్గకేంద్రంలోని మార్కెట్ యార్డులో మంగళవారం తిరిగి లావాదేవీలు ప్రారంభం కానున్నాయి. రెండు రోజులుగా సెలవుల కారణంగా మార్కెట్ తెరుచుకోలేదు. కాగా మంగళవారం యాధావిధిగా టెండర్లు నిర్వహించనున్నారు.

కలెక్టర్‌కు బీజేపీ నాయకుల శుభాకాంక్షలు



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన విజయేందిరకు బీజేపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు సోమవారం తన చాంబర్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు పుష్పగుచ్చాలు అందజేశారు. జిల్లా అభివృద్ధికి తమవంతు సహకరిస్తామని చెప్పారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పద్మజారెడ్డి, కౌన్సిలర్లు అంజయ్య, రామాంజనేయులు, కృష్ణవర్ధన్‌రెడ్డి, పాండురంగారెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, హరికృష్ణ ఉన్నారు.

హైమాస్ట్ లైట్ల ప్రారంభం



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 27వ వార్డు పరిధిలోని గణేష్‌నగర్‌లో ఏర్పాటుచేసిన హైమాస్ట్ లైట్లను సోమవారం సాయంత్రం మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సిద్దు, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం



దేవరకద్ర: మండల కేంద్రంలోని ప్రసిద్ధ ఈశ్వర వీరప్పయ్యస్వామి ఆలయాల పునర్నిర్మాణం కోసం భక్తులు విరివిగా చందాలు ఇస్తున్నారు. ఇప్పటికే రూ. కోటిపైగా చందాలు రావడంతో ఆలయాలను ఆధునికీకరణ చేశారు. అదేవిధంగా సోమవారం దేవరకద్రకు చెందిన కమ్మరి ఆంజనేయులు, భారతి దంపతులు రూ. 11,116 విరాళంగా అందించారు.

తిమ్మన్న సేవలు మరువలేం

కోయిల్‌కొండ: రిటైర్డ్ టీచర్ తిమ్మన్న సేవలు మరువలేనివని కాంగ్రెస్ నారాయణపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ కుంభం శివకుమార్‌రెడ్డి అన్నారు. కాగా తిమ్మన్న అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న శివకుమార్‌రెడ్డి మండలకేంద్రానికి వచ్చారు. తిమ్మన్నకు నివాళి అర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. తిమ్మన్న ఉపాధ్యాయుడుగా ఎంతోమంది యువత ఉన్నతస్థాయికి ఎదగడానికి కృషిచేశారన్నారు. మండల అధ్యక్షుడు జి.రవీందర్ తదితరులు ఉన్నారు.



రాజాపూర్ మండల కేంద్రంలో..



మహమ్మదాబాద్‌లో..



మిడ్జిల్‌లో..

త్యాగానికి ప్రతీక బక్రీద్



హన్వాడలో బక్రీద్ వేడుకల్లో పాల్గొన్న ముస్లింలు

సాక్షినెట్‌వర్క్: జిల్లావ్యాప్తంగా సోమవారం బక్రీద్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

■ జడ్చర్ల పరిధిలో బాదేపల్లి, జడ్చర్ల ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఈద్గాలు, కావేరమ్మపేట మదర్సాల వద్ద పెద్ద సంఖ్యలో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. ఉదయం 9గంటలకే ఈద్గాలకు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. ఈద్గాల వద్ద ఇమామ్‌లు బక్రీద్ ప్రార్థనలు చేయించారు. బక్రీద్ విశిష్టతలను వివరించారు. బాదేపల్లి ఈద్గావద్ద జెడ్పీ వైస్‌చైర్మన్ కోడ్గల్ యాదయ్య, కాంగ్రెస్ నాయకులు బి.శివకుమార్‌లు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా మండలంలోని నసురుల్లాబాద్, కోడ్గల్, లింగంపేట, గంగాపురం, ఆల్వాన్‌పల్లి, అలూరు గ్రామాల్లోనూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

■ త్యాగానికి ప్రతీక బక్రీద్ అని నాయకులు అన్నారు ఈమేరకు సోమవారం పండుగ సందర్భంగా పలువురు నాయకులు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. కాగా రాజాపూర్ మండల కేంద్రంతో పాటు పరిధిలోని తిరుమలాపూర్, కుచ్చర్‌కల్, చొక్కంపేట్ తదితర గ్రామాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు.

■ దేవరకద్ర మండల కేంద్రంలో సోమవారం ఘనంగా బక్రీద్ వేడుకలు నిర్వహించారు. పట్టణంలోని ముస్లింలు ఊరేగింపుగా ఈద్గాకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కౌకుంట్ల మండలకేంద్రంలో ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తహసీల్దార్ ఎల్లయ్య, నాయకులు శేఖర్‌రెడ్డి తదితరులు ఈద్గా వద్దకు వచ్చి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.



బాదేపల్లి ఈద్గావద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



కౌకుంట్లలో ప్రార్థనలు

■ కోయిల్‌కొండ మండల కేంద్రంతో పాటు అంకిళ్ల, కొత్లాబాద్ తదితర గ్రామాల్లో ప్రత్యేకప్రార్థనలు చేశారు.

■మహమ్మదాబాద్ పరిధిలోని అన్ని గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు.

■ భూత్పూర్ మున్సిపాలిటీతో పాటు మండలంలోని వివిధ గ్రామాలల్లో సోమవారం బక్రీద్ వేడుకలు నిర్వహించారు. భూత్పూర్‌లోని ఈద్గా వద్ద మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, సీనియర్ నాయకులు నారాయణ గౌడ్, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్ గౌడ్, విండో డైరెక్టర్ రాములు ముస్లింకు శుభాకాంక్షలు తెలిపారు.

■ మిడ్జిల్ పరిధిలో మండల కేంద్రంతో పాటుగా బోయిన్‌పల్లి, రాణిపేట్, కొత్తపల్లి, వాడ్యాల్ గ్రామాలలోని ఈద్గాల దగ్గర ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

■ అడ్డాకుల, మూసాపేట మండలాల్లోని గ్రామాల్లో వేడుకలు ఘనంగా జరిగాయి. అడ్డాకుల, కందూర్, పొన్నకల్, రాచాల, శాఖాపూర్, మూసాపేట, జానంపేట, వేముల, పోల్కంపల్లి గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తర్వాత ఈద్గాల వద్ద వివిధ పార్టీల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

■ హన్వాడ పరిధిలో మండలకేంద్రంతో పాటు చిన్నదర్పల్లి, కొత్తపేట, గొండ్యాల్, వేపూర్, మునిమోక్షం, తదితర గ్రామాల్లో శివారు ప్రాంతాల్లోని ఈద్గాల వద్ద మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

■ నవాబుపేట మండల కేంద్రంతో పాటు యన్మన్‌గండ్ల, ఇప్పటూర్, చౌడూర్, రంగంపల్లి, కాకర్‌జాల్ గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు.

■ బాలానగర్ మండల కేంద్రంతో పాటు పరిధిలోని చిన్నరేవల్లి, మోతిఘనాపూర్, పెద్దరేవల్లి, తదితర గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు.

■ చిన్నచింతకుంట పరిధిలో పెద్దవడ్డేమాన్, చిన్నచింతకుంట, సీతారాంపేట, లాల్‌కోట, బండ్రపల్లి, ఉంధ్యాల, తదితర గ్రామాలల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



చిన్నచింతకుంటలో..



బాలానగర్‌లో..



మూసాపేటలో..



కోయిల్‌కొండలో ..



భూత్పూర్‌లో శుభాకాంక్షలు తెలుపుతున్న మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్..



కందూర్‌లో..

విద్యాభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నాం



ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్/జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): విద్యాభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం ముదిరాజ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయడం ఆనందంగా ఉందన్నారు. ఇక విద్య కోసం దూర ప్రాంతాలకు పోవాల్సిన అవసరం లేదని, భవిష్యత్తులో ఇంజనీరింగ్, లా కళాశాలతోపాటు సాంకేతిక శిక్షణ ఇప్పించే కేంద్రాలు కూడా మన ప్రాంతానికి వస్తున్నాయని అన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎన్పీ వెంకటేశ్, లక్ష్మణ్‌యాదవ్‌తోపాటు మైత్రి యాదయ్య, డాక్టర్ శ్రీనివాస్‌రాజు, ఎన్.శ్రీనివాసులు, మెట్టుకాడి శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

చెక్ అందజేత

దొడ్డలోనిపల్లి 17వ వార్డులోగల ముస్లిం స్మశానవాటికకు రహదారి ఏర్పాటు కోసం తన నియోజకవర్గ నిధుల నుంచి.. రూ.2లక్షల చెక్‌ను సోమవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆ ప్రాంతానికి చెందిన పలువురు ముస్లింలకు అందజేశారు. కార్యక్రమంలో అశ్వాక్, హకీం, నాసర్ మజహరి, బిలాల్, జహంగీర్, ముతార్, మక్సూద్, నిరంజన్, ఖాదర్, ఫరీద్, ముస్తాక్ ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

దుండగులపై కఠినచర్యలు తీసుకోవాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: మెదక్ జిల్లా కేంద్రంలో పశువుల అక్రమ రవాణా పేరుతో అమాయక ప్రజలపై పాశవికంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచి ఆస్తుల ధ్వంసానికి పాల్పడిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు ముస్లింలు కోరారు. సోమవారం బక్రీద్ ప్రత్యేక నమాజ్ అనంతరం జిల్లా కేంద్రంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కొంతమంది ఇష్టారాజ్యంగా దాడులు చేస్తున్నారన్నారు. వారిని గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని అన్నారు. బాధితులకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఆర్థికసాయం చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్, ఉపాధ్యక్షుడు సయ్యద్ వహీద్‌షా, అతీఖుర్ రెహమాన్, ముఖ్తార్ అహ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ఝాన్సీ లక్ష్మీబాయికి ఘననివాళి



నివాళి అర్పిస్తున్న సంస్కార భారతి సభ్యులు

జడ్చర్ల టౌన్: వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి వర్ధంతిని సోమవారం పట్టణంలో నిర్వహించారు. ఈ మేరకు పట్టణంలోని అనురాగిణి ఆశ్రమంలో ఘన నివాళి అర్పించారు. సంస్కారభారతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు జయపాల్‌రెడ్డి పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. దేశభక్తి పెంపొందాలంటే ఝాన్సీ లక్ష్మీబాయి లాంటి త్యాగధనుల చరిత్రలు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంస్కారభారతి సభ్యుడు గోనెల రాధాకృష్ణ, భువనేశ్వరి, ఆశ్రమ విద్యార్థులు పాల్గొన్నారు.

బాలుడు అదృశ్యం..వెంటనే ఆచూకీ లభ్యం

జడ్చర్ల: స్థానిక కొత్త బస్టాండ్‌లో ఓ బాలుడు తప్పిపోగా.. కొద్దిసేపటికే ఆచూకీ లభ్యం కావడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్న ఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మిడ్జిల్‌కు చెందిన నవీన్(13) తండ్రి మాసయ్యతో కలిసి మిడ్జిల్‌కు వెళ్లేందుకు కొత్తబస్టాండ్‌కు వచ్చారు. కాగా మాసయ్య హోటల్‌లో తినుబండారాలు తీసుకురావడానికి వెళ్లివచ్చే లోగా నవీన్ కనిపించకుండా పోయాడు. బస్టాండ్‌లో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సమాచారం ఇచ్చాడు. వెంటనే స్పందించిన పోలీసులు బస్టాండ్‌లో సీసీ ఫుటేజీలను పరిశీలించారు. తదుపరి మహబూబ్‌నగర్ బస్టాండ్‌లో నవీన్ ఉన్నట్లు గుర్తించారు. కాగా మిడ్జిల్‌కు చెందిన ఎంపీటీసీ సభ్యుడు గౌస్ మహబూబ్‌నగర్ బస్టాండ్‌లో నవీన్‌ను గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. నవీన్ మిడ్జిల్‌కు వెళ్లే బస్సుకు బదులుగా మహబూబ్‌నగర్‌కు వెళ్లే బస్సును ఎక్కడంతో కొంతసేపు ఆందోళన చోటు చేసుకుందని ఈసందర్భంగా సీఐ ఆదిరెడ్డి తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

అడ్డాకుల: మండలంలోని కందూర్ గ్రామానికి చెందిన కళమ్మ అనారోగ్యానికి గురై మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని సోమవారం బీజేపీ జిల్లా నాయకుడు మున్నూర్ రమేష్ పరామర్శించారు. కళమ్మ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం బాధితకుటుంబానికి రూ.5వేల ఆర్థికసాయం అందజేయించారు. శంకర్, రాకేష్, బుడ్డన్న, చంద్రమౌళి, సత్యన్న తదితరులు ఉన్నారు.

ఒప్పందం ప్రకారం కూలి చెల్లించాలి



చిన్నచింతకుంట: కార్మికులకు ఒప్పందం ప్రకారం యాజమాన్యం కూలి చెల్లించాలని.. బీడీ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి. యాదగిరి డిమాండ్ చేశారు. సోమవారం చిన్నచింతకుంటలో బీడీ కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీడీ కార్మికులు వెయ్యి బీడీలు చుడితే రూ. 235 చెల్లి స్తామని ఫ్యాక్టరీ యాజమాన్యం ఒప్పుకొందన్నారు. కొన్నిరోజుల క్రితం కార్మిక సంఘాలతో జరిగిన చర్చలలో ఒప్పందం కుదిరిందన్నారు. అందుకు అనుగుణంగా కూలి చెల్లించకుండా అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. వెంటనే ఒప్పందం ప్రకారం కూలి ఇవ్వాలన్నారు.

వంతెన లేక అవస్థలు

మాగనూర్: మండల పరిధిలోని గజ్జరందొడ్డి పెద్దవాగుపై వంతెన లేకపోవడంతో వాహనదారులు అష్టకష్టాలు పడుతున్నారు. ముఖ్యంగా ఈ మార్గం నుంచి మక్తల్ పట్టణానికి కొల్పూర్, మందిపల్లి, గజ్జరందొడ్డి గ్రామాల ప్రజలు నిత్యం పదుల సంఖ్యలో ప్రయాణం సాగిస్తుంటారు. వర్షాకాలంలో పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తుంటుందని, దీంతో నెలల తరబడి ఈ మార్గంలో రాకపోకలకు అంతరాయం కలుగుతుందని వాపోతున్నారు. మందిపల్లి నుంచి మక్తల్‌కు వాడ్వట్ మీదుగా వెళ్లేందుకు బీటీ రోడ్డు ఉన్నా.. చాలా దూరం ఉండటంతో తక్కువ దూరం ఉన్న ఈ మార్గంలో ప్రయాణించడానికి ప్రజలు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని త్వరితగతిన వంతెన నిర్మాణం చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



ఆర్టీసీ సేవలు వినియోగించుకోవాలి



పరిగి- కొత్లాబాద్ బస్సును ప్రారంభిస్తున్న ఆర్టీసీ అధికారులు, కాంగ్రెస్ నాయకులు

గండేడ్: ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పరిగి డీఎం కరుణ శ్రీ, జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పుల్లారెడ్డి, మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం గండీడ్ మండలపరిధిలోని జిన్నారం గేట్ వద్ద పరిగి- కొత్లాబాద్ బస్సును పునరుద్ధరించిన సందర్భంగా మాట్లాడారు. కాగా మంగళహారతులతో పెద్ద వార్వాల్, చిన్న వార్వాల్, రంగారెడ్డిపల్లి, సల్కర్‌పేట్, బల్సూర్‌కొండ, పగిడ్యాల్ తదితర గ్రామప్రజలు, కాంగ్రెస్ నాయకులు, మహిళలు స్వాగతం పలికారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించిందని అన్నారు. దీంతో గ్రామీణ పేద మహిళలకు ఎంతో ఉపయోగంగా మారిందన్నారు. బస్సు ఇబ్బందుల గురించి గత పాలకులు పట్టించుకోలేదన్నారు. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి చొరవతో పరిగి- కొత్లాబాద్ బస్సు సౌకర్యం కల్పించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పరిగి డిపో ఏఎం సోమ్లానాయక్, పీఏసీసీ సభ్యుడు నర్సింహరావు, ఎంపీటీసీ వెంకట్‌రాంరెడ్డి, మాజీ సర్పంచ్‌బోయిని గోపాల్, పులీందర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఆసిరెడ్డి, ఎస్టీ సెల్ అధ్యక్షుడు కోట్యానాయక్, యూత్ కాంగ్రెస్ నాయకుడు కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలి

హన్వాడ: కార్పొరేట్ విద్యాసంస్థల్లో విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంబులయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మండలకేంద్రంలో దండోర నాయకులతో సమావేశమై మాట్లాడారు. గత ప్రభుత్వం కేజీ టు పీజీ విద్య అంటూ మాయ మాటలు చెప్పిందని ఆరోపించారు. గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా అన్ని కార్పొరేట్ విద్యాసంస్థల్లో 25శాతం కోటాను బడుగుబలహీన వర్గాలకు కేటాయించి ఉచితంగా విద్యనందించాలన్నారు. అదేవిధంగా గత ప్రభుత్వం 12 వేల పాఠశాలల్ని మూసివేసిందని.. వాటిని వెంటనే తెరిపించి ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 19న ఈఅంశంపై హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దండోర నాయకులు శ్రీనివాసులు, గంగయ్య, కృష్ణయ్య, కిరణ్, యాదయ్య, వెంకటేష్, రాములు, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతగా రోడ్డును నిర్మించాలి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న గ్రామస్తులు

కోయిల్‌కొండ: మండలంలోని లింగుపల్లిదారి నుంచి చన్మన్‌పల్లి వరకు బీటీ, సీసీరోడ్డు నిర్మాణం నాణ్యతతో చేయాలని కోరుతున్నారు. కాగా ఎస్డీఎఫ్ నిధులు రూ.1.35 కోట్లతో 1.8 కిలోమీటర్ల మేర ఈ రోడ్డును నిర్మిస్తున్నారు. ఈమేరకు సోమవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ యూత్‌కన్వీనర్ రవినాయక్, తదితరులు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా రవినాయక్ మాట్లాడారు. రోడ్డు నిర్మాణంతో ప్రయాణికులకు ఇబ్బందులు తొలగనున్నాయని పేర్కొన్నారు. కొన్ని సంవత్సరాలుగా రోడ్డు పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కాగా స్థానిక ఎమ్మెల్యే పర్ణికారెడ్డి ప్రత్యేక దృష్టిసారించి పనులను ప్రారంభించేందుకు కృషి చేశారని పేర్కొన్నారు.

దుమ్ము రేగుతోంది..!



వేములలో అసంపూర్తిగా వదిలేసిన బీటీరోడ్డు పనులు

అడ్డాకుల: మూసాపేట మండలం వేముల గ్రామంలో అసంపూర్తి బీటీరోడ్డు నిర్మాణం మూలంగా దుమ్ము రేగుతోంది. రోడ్డుపై కంకర వేసి వదిలేయడంతో వాహనాలు వెళ్లినప్పుడు దుమ్ముతో స్థానికులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఆరేడు ఏళ్లుగా రోడ్డు పనులు పూర్తి కావడం లేదు. 44వ నంబర్ జాతీయ రహదారి నుంచి వేముల గ్రామంలోని వాటర్ ట్యాంకు వరకు బీటీరోడ్డు వేశారు. వాటర్ ట్యాంక్ నుంచి పనులను పూర్తి చేయకపోవడంతో సుమారు అర కిలోమీటర్ దూరం వరకు గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న నివాస గృహాల్లో ఉండే వారు నిత్యం దుమ్ముతో సహవాసం చేస్తున్నారు. వాహనాలు వెళితే చాలు దుమ్ము ఇళ్లల్లోకి వస్తోంది. దుమ్ముతో శ్వాసకోస వ్యాధులకు గురవుతున్నట్లు స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు పనులు త్వరగా పూర్తి చేసే విధంగా చొరవ తీసుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.